ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలి

రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్


ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

అత్తాపూర్: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని, సంపూర్ణ ఆరోగ్యాన్ని అందించేందుకు పట్టణ ప్రాథమిక ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్లు ఎంతగానో ఉపయోగపడతాయని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, డీఎంఅండ్‌హెచ్‌వో వెంకటేశ్వర్‌రావు అన్నారు. పట్టణాల్లోనే బస్తీ ప్రజలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఏర్పాటు చేస్తున్న యూపీహెచ్‌సీ దవాఖానాలు మరింతగా ఉపయోపడే విధంగా దృష్టి సారించాలని తెలిపారు. అత్తాపూర్ డివిజన్ పాండు రంగారావు నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాయకష్టం చేసుకునే దినసరి కూలీలు ఫీజులు చెల్లించలేక వైద్యుల దగ్గరికి వెళ్లలేక వివిధ రోగాలతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో దవాఖానాలను ఏర్పాటు చేసుకుంటున్నామని వివరించారు. పూర్తిస్థాయిలో వైద్యులను నియమించలేనందున నార్సింగి ప్రభుత్వ ఆస్పత్రి వైద్యులు హస్నాబేగంను ఇక్కడికి ఇంచార్జి వైద్యురాలుగా నియమించారన్నారు. ఈ ఆస్పత్రికి సిబ్బందిని త్వరలో నియమిస్తామని తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఆస్పత్రి అందుబాటులో ఉంటుందని తెలిపారు. పరిసర ప్రాంతాల ప్రజలు ఆస్పత్రిలో వైద్య సేవలను సద్వినియోగం చేసుకొని మెరుగైన ఆరోగ్యాన్ని పొందవచ్చన్నారు. వైద్యులు నారాయణ, సురేఖ, మన్మథ, వినోద్, హెల్త్ ఆఫీసర్ చెన్నకేశవులు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయాలి


సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మాలతి

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ 13వ డివిజన్ సంఘం సిటీ కాలనీ, సాయి బాలాజీ నగర్‌లో రూ. 30 లక్షల వ్యయంతో చేపట్టపనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులను స్థానిక కార్పొరేటర్ రావుకోళ్ల మాలతీనాగరాజు గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... అభివృద్ధి పనులు నాణ్యతతో చేపట్టి సకాలంలో పూర్తిచేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. డివిజన్‌లోని అన్ని కాలనీలలో ప్రజలకు కావలసిన మౌలిక వసతులను కల్పిస్తూ దశలవారీగా డివిజన్‌ను అభివృద్ధి చేస్తున్నామన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు నాగరాజ్, నాయకులు మహమ్మద్ హమీద్, సయ్యద్ హెమద్, మహమ్మద్ రహుఫ్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదుకు స్పందన


గగన్ పహాడ్‌లో పార్టీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న బీజేపీ నాయకులు

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని గగన్ పహాడ్ ప్రాంతంలో గురువారం నిర్వహించిన ఇంటింటి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమానికి మంచి స్పందన లభించింది. ఎస్సీ మోర్చా చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ జోగి రవి ఆధ్వర్యంలో సభ్యత్వ నమోదును నిర్వహించారు. ముఖ్య అతిథిగా మాజీ శాసన సభ్యుడు, బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు కొండేటి శ్రీధర్‌లతో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బీజేపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సభ్యత్వ నమోదు చేసుకోవాలని సూచించారు. రాష్ట్రంలో ఈ సారి బీజేపీ జెండా ఎగురవేసేందుకు ప్రతి కార్యకర్తా సైనికుల్లా పోరాడాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. బీజేపీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి మొండ్ర కొమురయ్య, బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర నాయకులు అడికె రాజు, బీజేవైఎం నాయకుడు వినయ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన నూతన ఉపాధ్యాయులు


ప్రథమ స్థానంలో నిలిచిన శిరీష

అత్తాపూర్: ప్రభుత్వం చేపట్టిన డీఎస్సీలో ఎంపికైన రాజేంద్రనగర్ పట్టణ ప్రాంతానికి ఐదుగురు ఉపాధ్యాయులు విధుల్లో చేరినట్లు రాజేంద్రనగర్ మండల విద్యాధికారి శంకర్ రథోడ్ తెలిపారు. రాజేంద్రనగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు నూతనంగా ఇద్దరు మహిళా టీచర్లు అసలునగర్‌కు, ఒకరు భగవతి నగర్‌కు గణేష్ నగర్ ప్రాథమిక పాఠశాలకు మరో ఉపాధ్యాయురాలు నూతనంగా వీధుల్లోకి హాజరు అయినట్లు తెలిపారు. జోత్స్న, భవ్యశ్రీ, సౌమ్య, మౌనిక, శిరీషలు ఉపాధ్యాయ శిక్షణలో తర్ఫీదు పొంది మంచి ర్యాంకులు సాధించారు. గణేష్‌నగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయులుగా నియమితులైన శిరీష రంగారెడ్డి జిల్లాలోనే ప్రథమ స్థానంగా నిలవడం గమనార్హం. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఉపాధ్యాయ వృత్తిని తన చిన్నతనం నుంచి ఇష్టంగా ఎంచుకుని రంగారెడ్డి జిల్లాలోనే ప్రథమ స్థానం తనకు దక్కడం వెనుక ఎన్నో కష్టాలున్నాయని తెలిపారు. కుటుంబ సభ్యులు, భర్త సహకారంతో పెళ్లి తర్వాత విద్యను కొనసాగించి పట్టుదలతో ఉపాధ్యాయ వృత్తిలో చేరిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పేద మధ్యతరగతి కుటుంబాల పిల్లలను ఉన్నత విద్యావంతులుగా చేయడమే తన ప్రధాన లక్ష్యమని ఉపాధ్యాయురాలు శిరీష వివరించారు.

మానవ అక్రమ రవాణాను నిర్మూలించాలి

- అమ్మాయిలు, మహిళల జీవితాలు ఛిద్రం
- నిర్మూలనపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి
- నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నాగపూర్ణ

మణికొండ: మానవ అక్రమ రవాణా ప్రపంచ వ్యాప్తంగా అత్యంత వేగంగా విస్తరిస్తున్నదని, దాని నిర్మూలనకు సమాజంలోని ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో కృషి చేయాల్సిన అవసరం ఎంతో ఉందని నార్సింగి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ కేంద్రంలో ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ శేరిలింగంపల్లి ప్రాజెక్టుల ఆధ్వర్యంలో రెండు రోజులుగా అంగన్‌వాడీ టీచర్లకు కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమం ముగింపు సమావేశానికి ఆమె హాజరయ్యారు.

- ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ... మానవ అక్రమ రవాణా ఎంతో మంది అమ్మాయిల జీవితాలను నాశనం చేస్తోందన్నారు. పేద, మధ్య తరగతి మహిళలు, యువతులు ఇందులో పావులుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు.
- ప్రజలతో సన్నిహితంగా ఉండే అంగన్‌వాడీ టీచర్‌లు ఈ విషయంలో ప్రజలను జాగృతం చేయాలని ఆమె కోరారు. సైబర్ ట్రాఫికింగ్ వేగంగా విస్తరిస్తున్న జటిలమైన సమస్య అయినందున పిల్లలకు ఫోన్ ఉపయోగించటం ద్వారా వచ్చే అనర్థాలను ప్రజలకు వివరించాలని సూచించారు.

ఆదిలోనే అడ్డుకోవాలి...

మానవ అక్రమ రవాణాను ఆదిలోనే అడ్డుకుంటే మన ఆడపిల్లలను రక్షించుకోవచ్చని, రోజూ ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు దీని బారిన పడుతున్నారని సీడీపీఓ కవిత ఆందోళన వ్యక్తం చేశారు. పేద, మధ్య తరగతి యువతులు, మహిళలు ఉద్యోగాలు, ప్రేమ, పెళ్లి, సినిమాల్లో అవకాశాల పేరుతో మోసాలకు గురవుతున్నారన్నారు. అలాంటి వారు దీనిపై అవగాహన పెంచుకోవాలన్నారు.

- ప్రజ్వల సంస్థ మానవ అక్రమ రవాణా నిర్మూలనకు, లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా పనిచేస్తూ 28,600 మంది అమ్మాయిలను కాపాడి పునరావాసం కల్పించామని సంస్థ సీనియర్ ప్రాజెక్ట్ మేనేజర్ బలరామ కృష్ణ అన్నారు. తమ సంస్థ వ్యవస్థాపకురాలు, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ సునిత కృష్ణన్ పలు ప్రభుత్వ రంగ సంస్థలతో కలిసి పనిచేయటంతో పాటు సమాజంలో పెరుగుతున్న మానవ అక్రమ రవాణా, సైబర్ ట్రాఫికింగ్, లైంగిక వ్యాపారాలను అరికట్టేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తున్నారన్నారు.
- అంగన్‌వాడీ టీచర్‌లకు శిక్షణ ఇచ్చి ప్రజలను జాగృతం చేసేందుకు ఈ శిక్షణ నిర్వహించామన్నారు.
- అంగన్‌వాడీ సూపర్ వైజర్లు నీలవేణి, ఇందిరా రాణి, ఉమారాణి, పద్మ, పద్మజ, ప్రజ్వల, ప్రతినిధులు సురేష్‌కుమార్, అంబర్‌సింగ్, చెన్న కేశవ్, అశ్రీత, దశరథ్, ఉమా మహేశ్వరి, రజిత, అంగన్‌వాడీ టీచర్‌లు పాల్గొన్నారు.

బీసీ కుల గణనకు సిద్ధంగా ఉండాలి

బండ్లగూడ: రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన వెంటనే బీసీ కుల గణన మొదలు పెట్టాలని ఇందుకు ఎన్యూమరేటర్స్ సిద్ధంగా ఉండాలని బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ బి.శరత్ చంద్ర అన్నారు. గురువారం కార్పొరేషన్ కార్యాలయంలో మున్సిపల్ అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కులగణన ప్రక్రియ మొత్తాన్ని మొబైల్ ఫోన్ ద్వారా వివరాలు నమోదు చేయాల్సి ఉంటుందని, అందుకు అవసరమైన పూర్తి స్థాయి శిక్షణను త్వరలోనే అందిస్తామన్నారు. ఎన్యూమరేటర్లు అందరూ అందుబాటులో ఉండి సకాలంలో గణనను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో మేనేజర్ మంజులత, డీఈ యాదయ్య, ఏఈ రాజ్‌కుమార్, ఆర్‌ఐ శివ, శానిటరీ ఇంచార్జి శ్రీలత, సిబ్బంది, బిల్‌కలెక్టర్‌లు పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీని కలిసిన పీసీసీ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడు



శంషాబాద్: పీసీసీ ఎస్సీసెల్ ఉపాధ్యక్షుడు జల్లపల్లి నరేందర్ గురువారం ఢిల్లీలోని ఆయన నివాసంలో ఏఐసీసీ అగ్రనేత, ఎంపీ రాహుల్‌గాంధీని కలిశారు. ఈ సందర్భంగా ఆయనతో మాట్లాడుతూ... పీడిత వర్గాలకు అన్యాయం జరగకుండా తెలంగాణ రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలయ్యేలా సర్కారుకు సూచించాలని కోరారు.

ప్రజలు అధైర్యపడొద్దు

- హైడ్రా బాధితులకు అండగా ఉంటాం
- ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి


బాధిత ప్రజలతో మాట్లాడుతున్న ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి

అత్తాపూర్: ప్రజలు అధైర్యపడొద్దు బీజేపీ అండగా ఉంటుంది అని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అత్తాపూర్ డివిజన్ ప్రాంతంలో భరత్ కాలనీ టీకేఆర్ కాలనీలో హైడ్రా బాధిత మూసీ ప్రాంతాల వాసులకు భరోసా ఇచ్చారు. రాజేంద్రనగర్ నియోజకవర్గం పరిధిలోని అత్తాపూర్ డివిజన్ ప్రాంతంలో భరత్ కాలనీ టీకేఆర్ కాలనీలో హైడ్రా మూసి ప్రాంతాలలో ఉన్నాయని కాలనీలో ఉన్న ఇండ్లకు మార్కింగ్ వేయడంతో విషయం తెలుసుకున్న కంటెస్టెడ్ ఎమ్మెల్యే తోకల శ్రీనివాస్ రెడ్డి, స్థానికుల విజ్ఞప్తి మేరకు ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి బాధిత ప్రజల దగ్గరికి వెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మేము మీ వెంట ఉంటాము అని ధైర్యం చెప్పారు. ఇక్కడ హద్దు బందు 5 ఏళ్ల క్రితం పెట్టారని అది తెలుసుకునే ప్రజలు ఇక్కడ ఇల్లు కట్టుకుని ఉంటున్నారని మళ్లీ ఇప్పుడు కొత్తగా వచ్చి మార్కింగ్ చేయడం దుర్మార్గపు చర్య అని శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఈ విషయంపై ఎంత దూరమైనా వెళ్తామని వీలైనంత తొందరలో కోర్టు ద్వారా సమస్య పరిష్కారానికి చేస్తామని.. కూలగొట్టే ఉద్దేశం ఉన్నట్లయితే ప్రజల ఆస్తి నష్టానికి మూడు రెట్లు నష్టపరిహారం ఇచ్చిన తర్వాతే ఇక్కడికి రావాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కార్యక్రమంలో బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ మల్లారెడ్డి, నేతలు వై.శ్రీధర్, కొమరయ్య, గౌరీ శంకర్, అసెంబ్లీ కన్వీనర్ మల్లేష్ యాదవ్, వేణుగోపాల్ రెడ్డి, వెంకట్ రెడ్డి, అమర్ స్టార్ చిన్న ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

హమాలీలకు 'హెల్త్ కార్డు, పెన్షన్' కల్పించాలి


కార్మికులతో మాట్లాడుతన్న ఏఐటీయూసీ నాయకులు

బండ్లగూడ: మూటలు మోసి జీవనం సాగించే హమాలీ కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం వృద్ధాప్యంలో ఆదుకొనేందుకు పెన్షన్ వసతితోపాటు హెల్త్ కార్డులు, ఈఎస్‌ఐ సౌకర్యాలను కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు డిమాండ్ చేశారు. గురువారం కిస్మత్‌పూర్‌లోని సివిల్ సప్లై గోదాము హమాలీ కార్మికులను కలిసి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కార్మికులకు ప్రమాదాలు జరిగితే ప్రభుత్వం వారిని ఆదుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పని చేసే కాంట్రాక్టు కార్మికులందరినీ ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. ఈ నెల 20న రాజేంద్రనగర్‌లో జరిగే హమాలీ కార్మికుల సమావేశంలో జిల్లా వ్యాప్తంగా వారు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి పరిష్కారానికి తగు కార్యాచరణ రూపొందిస్తామన్నారు. సమావేశానికి కార్మికులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు. జిల్లా కార్యదర్శి మల్లేష్, ప్రభు, శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.

టీజీపీఏలో ఘనంగా వాల్మీకి జయంతి


మహర్షి వాల్మీకికి నివాళులు అర్పిస్తున్న పోలీస్ అకాడమీ అధికారులు

బండ్లగూడ: తెలంగాణ పోలీస్ అకాడమీలో మహర్షి వాల్మీకి జయంతిని ప్రభుత్వ ఆదేశాల మేరకు గురువారం ఘనంగా నిర్వహించారు. అకాడమీలోని ఏకశిలా బ్లాక్‌లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... రామాయణ మహా కావ్యాన్ని వాల్మీకి రచించిన విషయాన్ని గుర్తుచేస్తూ రామాయణం ద్వారా కుటుంబ వ్యవస్థ, భార్యాభర్తల అనుబంధం గురించి ప్రపంచానికి గొప్ప సందేశం ఇచ్చారన్నారు. డీఎస్పీ కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ... వాల్మీకి వేటగాడి నుంచి మహర్షిగా మారిన విధానం లోకానికే స్ఫూర్తి అన్నారు. పోలీస్ అకాడమీ డిప్యూటీ డైరెక్టర్ సునిత మోహన్, సహాయ డైరెక్టర్‌లు వేణుగోపాల్‌రెడ్డి, వెంకటరావు, భూపాల్, శ్రీదేవి, డీఎస్పీలు శ్రీనివాస్‌రావు, జగదీశ్వర్‌రావు, కృష్ణ, తిరుపతి, బాలయ్య, శ్రీను, ఏఓ వెంకటశేఖర్‌లతో పాటు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

బండ్లగూడ: బండ్లగూడ జాగీర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. మేయర్ లతాప్రేమ్‌గౌడ్, డిప్యూటీ మేయర్ రాజేందర్ రెడ్డి, కమిషనర్ శరత్‌చంద్రలతో కలిసి వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రపంచానికి పవిత్ర రామాయణాన్ని కానుకగా ఇచ్చిన ఆదికవి మహర్షి వాల్మీకి అని అన్నారు. మేనేజర్ మంజులత, స్వాతి, యాదయ్య, రాజ్‌కుమార్, శివ పాల్గొన్నారు.

నార్సింగిలో...

మణికొండ: నార్సింగి మున్సిపల్ కార్యాలయం వద్ద మహర్షి వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి మున్సిపల్ చైర్‌పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్, కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. మేనేజర్ యోగేష్, ఏఈ శ్రీనివాస్, ఆర్‌ఐ అఖిల్, అకౌంటెంట్ కృష్ణయ్యలతో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.


మహర్షి వాల్మీకికి నివాళులర్పిస్తున్న దృశ్యం


నార్సింగిలో నివాళులర్పిస్తున్న చైర్‌పర్సన్, కమిషనర్...

అంగన్‌వాడీలకు వేతనాలు చెల్లించాలి: సీఐటీయూ


సీపీడీఓకు వినతిపత్రం ఇస్తున్న సీఐటీయూ మండల కన్వీనర్ ప్రవీణ్‌కుమార్

మణికొండ: రాష్ట్రంలో మినీ అంగన్‌వాడీల నుంచి మెయిన్ అంగన్‌వాడీ టీచర్‌లుగా పదోన్నతి పొందిన 4 వేల మంది టీచర్‌లకు ఐదు నెలలుగా జీతాలు ఇవ్వక పోవటంతో వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే వారికి జీతాలను చెల్లించాలని సీఐటీయూ గండిపేట మండల కన్వీనర్ డి.ప్రవీణ్‌కుమార్ సీడీపీఓ కవితకు వినతిపత్రం అందజేశారు. గురువారం నార్సింగిలో ఆమెను కలిసి అంగన్‌వాడీ టీచర్‌లకు మార్చి నుంచి సెప్టెంబర్ వరకు వేతనాలు పాత పద్ధతిలోనే సగం మాత్రమే చెల్లించారని వివరించారు. వారికి పదోన్నతులు రావటంతో జీవితాలు మారతాయని సంతోష పడ్డారని, వారికి ఇవ్వాల్సిన జీతాలను పెంచి ఇవ్వకపోవటంతో ఆందోళనకు గురవుతున్నారన్నారు. వారిని మెయిన్ అంగన్‌వాడీ టీచర్‌లుగా గుర్తిస్తే వారి జీతాలను ఆర్థిక శాఖ ట్రెజరీలలో అప్‌డేట్ చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 15 సంవత్సరాలుగా ఖాళీగా ఉన్న అంగన్ వాడీ టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు చర్యలు


డివైడర్‌పై బారికేడ్లు ఏర్పాటు చేస్తున్న ఇన్‌స్పెక్టర్ సుధాకర్‌రావు

లంగర్‌హౌస్: డివైడర్లపై వాహనాలతో దాడుతూ రాంగ్‌రూట్‌లో వెళ్లేవారిపై కఠిన చర్యలు తప్పవని టోలిచౌకి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రావు అన్నారు. ప్రమాదకరంగా డివైడర్లపై నుంచి వాహనాలతో దాటుతూ ప్రమాదాల బారిన పడుతుండటంతో వాటి నివారణకు ఆయన ఆధ్వర్యంలో గురువారం పలు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ముఖ్యంగా డివైడర్‌పై నుంచి దాటుతున్న సంగం ఆర్మీ చెక్ పోస్ట్ నుంచి టిప్పుఖాన్ బ్రిడ్జి వరకు బారికేడ్లు ఏర్పాటు చేస్తున్నారు. వాటిని జరపకుండా తీగలతో కడుతూ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... అత్తాపూర్ వైపు నుంచి వచ్చేవారు టిప్పుఖాన్ బ్రిడ్జి వద్ద యూటర్న్ తీసుకోకుండా మధ్యలో ప్రమాదకరంగా డివైడర్‌పై నుంచి వాహనాలు పోనిస్తున్నారన్నారు. వీటి నివారణకు శాశ్వతంగా గ్రిల్స్ ఏర్పాటుకు పై అధికారులకు దరఖాస్తు పెట్టామన్నారు.

నేడు నార్సింగిలో అభివృద్ధి పనుల ప్రారంభం

మణికొండ: నార్సింగి మున్సిపాలిటీ పరిధిలో శుక్రవారం కోకాపేట 4, 5, వార్డులు, నార్సింగి 6, 7, 17, 18, వార్డులలో పలు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్ ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ టి.కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి కార్యక్రమాలు ప్రారంభమై మధ్యాహ్నం వరకు కొనసాగుతాయన్నారు. ఆయా కార్యక్రమాల్లో మున్సిపల్ ప్రజా ప్రతినిధులు, అన్ని శాఖల అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన



రాజేంద్రనగర్: హసన్‌నగర్‌లో చేపడుతున్న 200 మీటర్ల పైప్‌లైన్ పనులను గురువారం ఎమ్మెల్సీ మీర్జా రహమత్ బేగ్ తదితరులు పరిశీలించారు. మాజీ కార్పొరేటర్లు హబీబ్ జైన్ ఆరీఫ్, రాజేంద్రనగర్ మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖదీర్ నాయకులు మహ్మద్ మహబూబ్, మహ్మద్ జహంగీర్, సయ్యద్ నజీర్‌లతో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మీర్జా రమహత్ బేగ్ మాట్లాడుతూ... స్థానిక ప్రజలకు ఎలాంటి ఆటంకాలు జరగకుండా పనులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు.

జలమండలి జీఎంకు సత్కారం


జలమండలి జీఎంను సత్కరించిన బీఆర్‌ఎస్ నాయకులు

మణికొండ: నీటి ఎద్దడిని పరిష్కరించిన జలమండలి మణికొండ డివిజన్ జీఎం మహేందర్‌నాయక్‌ను బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు గురువారం సత్కరించారు. ఇటీవల కాలనీల పర్యటనలో భాగంగా డాలర్‌హిల్స్, ఖిజ్రా కాలనీలు ఎత్తు ప్రాంతంలో ఉండటంతో వాటిని నీటి సరఫరా కావటం లేదని, నీటి సరఫరాకు అవసరమైన బూస్టర్‌లు ఏర్పాటు చేసి నిరుపయోగంగా ఉంచారని ప్రజలు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లడంతో స్పందించిన ఆయన బూస్టర్‌లు పనిచేసేలా చేసి నీటి సమస్యను పరిష్కరించారు. దాంతో బీఆర్‌ఎస్ పార్టీ మున్సిపాలిటీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కె.ధన్‌రాజ్ ఆధ్వర్యంలో జీఎంను సత్కరించారు. నాయకులు ఉపేంద్రనాథ్‌రెడ్డి, ఎం.లక్ష్మయ్య, ఎ.లక్ష్మణ్ రావు, సయ్యద్ ఆరిఫ్, సయ్యద్ రఫిక్ తదతరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలపై అవగాహన


ప్రజలకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాజేంద్రనగర్: భవిష్యత్ తరాలకు భూగర్భ జలాలను అందించేందుకు ఇంకుడు గుంతల ఎంతగానో ఉపకరిస్తాయని.. వాటి నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని రాజేంద్రనగర్ జలమండలి అధికారులు సూచించారు. గురువారం రాజేంద్రనగర్ డివిజన్‌లో జలమండలి అధికారులు ఇంకుడు గుంతలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ... భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా జలమండలి ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. సమస్త జీవకోటికి జలమే జీవన ఆధారమని... నేలరాలే ప్రతి వర్షపు నీటి బొట్టునూ రేపటి కోసం కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో జలమండలి అధికారులు, పరిసర ప్రాంతాల ప్రజలు పాల్గొన్నారు.

విద్యుత్ డీఈకి శుభాకాంక్షలు



మణికొండ: విద్యుత్ శాఖ ఇబ్రహీంబాగ్ డివిజన్ డీఈగా బాధ్యతలు తీసుకున్న రమేష్‌చంద్రను గురువారం 1104 యూనియన్ నాయకులు, విద్యుత్ అధికారులు, సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నార్సింగిలోని డీఈ కార్యాలయంలో ఆయనను కలిసి డివిజన్ పరిధిలోని విద్యుత్ సమస్యల పరిష్కారానికి తమ వంతు కృషి చేస్తామని పేర్కొన్నారు. నూతన డీఈ ఆధ్వర్యంలో వినియోగదారులకు మరింత మెరుగైన సేవలు అందిస్తామన్నారు. 1104 యూనియన్ కంపెనీ అడిషనల్ సెక్రటరీ, సైబర్‌సిటీ సర్కిల్ రీజనల్ సెక్రటరీ ఎం.భాస్కర్‌రెడ్డి, యూనియన్ ప్రతినిధులు, అధికారులు, సిబ్బంది ఉన్నారు.

నేడు మూసీ నిర్వాసితులకు రుణాల అందజేత


యుగంధర్‌రెడ్డి

చార్మినార్: జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోన్ పరిధిలోని పిల్లి గుడిసెలు 2బీహెచ్‌కే డిగ్నిటీ హౌసింగ్ కాలనీలోని మూసీ నిర్వాసితులకు సెల్ఫ్ హెల్ప్ గ్రూప్ (ఎస్‌హెచ్‌జీ)ల ద్వారా శుక్రవారం ఆర్థిక సాయం అందజేయడానికి జీహెచ్‌ఎంసీ ఇప్పటికే తగిన ఏర్పాట్లు చేసింది. యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆర్థిక సహకారంతో స్వయం సహాయక బృందాలకు ఈ వడ్డీ లేని రుణాలను అందజేయడానికి శ్రీకారం చుట్టింది. జీహెచ్‌ఎంసీ సర్కిల్–6 యూసీడీ ప్రాజెక్ట్ అధికారి యుగందర్‌రెడ్డి పర్యవేక్షణలో అధికారులు, సిబ్బంది ఇప్పటికే 11 స్వయం సహాయక బృందాలను ఏర్పాటు చేయగా.. వాటన్నింటిని స్థానిక యూబీఐ మేనేజర్‌తో పాటు ఇతర బ్యాంక్ అధికారులు పరిశీలించారు. 10 మంది చొప్పున 10 గ్రూపులను ఏర్పాటు చేసి ఒక్కో గ్రూప్‌కు దాదాపు రూ.20 లక్షల ఆర్థిక సహాయం అందజేయడానికి జీహెచ్‌ఎంసీ ప్రాజెక్ట్ అధికారులు కార్యాచరణ రూపొందించారు. ఇందులో ఒక్కో గ్రూప్ సభ్యురాలికి రూ.2 లక్షల ఆర్థిక సహాయాన్ని శుక్రవారం ప్రజాభవన్‌లో అందజేయనున్నామని యుగంధర్‌రెడ్డి తెలిపారు.